# చికిత్స

మొపాసా

స్వేచ్ఛానువాదం:
ధనికొండ హనుమంతరావు

గెస్టవ్, పాల్మయిరీల వయస్సు దాదాపు ఒకటేనని చెప్పాలి. ఆ దంపతుల్లో గెస్టవ్ బలహీనుడైనప్పటికీ, భార్యకన్న చిన్నవాడుగా కనిపిస్తాడు. గెస్టవ్ వ్యాపారంలో బాగా సంపాయించాక ఒక పెద్ద ఎస్టేటు కొన్నాడు. ఆ దంపతులిప్పుడు ఎస్టేటులోనే కాలం వెళ్ళబుచ్చుతున్నారు.

వారి మేడ చుట్టూ అందమైన తోట వుంది. మేడకు.. కొద్దిదూరంలో చిన్న మొక్కల్ని కాపాడేందుకుగాను, చిన్న ఇల్లొకటి వుంది. గెస్టవ్ పొట్టిగా, నున్నగా, ఆనందంతో, ఉత్సాహంతో ఉండేవాడు. అతని భార్య సన్నగా, స్వాభిమానాన్ని వ్యక్తపరుస్తూ ఉండేది. భర్త చూపే ఉత్సాహాన్ని ఆమె మెచ్చుకోలేకపోగా, ఆ దాంపత్యం ఆమెకెంతో అసంతృప్తికరంగా ఉండేది. ఆమె నెరసిన వెంట్రుకలకు రంగు వేసుకునేది. ఒక్కొకప్పుడు నవలల్ని చదివి, ఎంతో ఊహాగానం చేసేది: ఆ ఫలితంగా ఆమె తియ్యని కలల్ని కనేది. ఈ రకం సాహిత్యమంటే ఆమె ఏవగించుకున్నప్పటికీ, నవలల్ని చదవకుండా మాత్రం ఉండలేకపోయేది. ఆమె జీవితంలో ఎలాటి కామోద్రిక్తమైన సంఘటనను ఎదుర్కొకపోయినా, ప్రజలు ఆమె కామవాంఛను గొప్పగా చెప్పుకునేవారు. ఐతే ఆమె భర్త అప్పుడప్పుడు "నా భార్య చాలా ఉత్సాహంగా, విలాసంగా వుంటుంది" అనేవాడు. మాటవరసకన్న ఈ మాటలే ప్రజల్లో రకరకాల అనుమానాలకు పునాది వేసి ఉంటవి.

కొన్ని సంవత్సరాలనుంచీ భర్తకన్న ఎక్కువ కామోద్రేకానికి ఆమె గురవుతూన్న మాట నిజం. ఆమె హృదయంలో ఏదో రహస్యవేదన పెంపొందుతూన్నట్లుగా ఆమె ఎప్పుడూ కఠినంగా, ఉండసాగింది. ఫలితంగా ఆ దంపతులమధ్య భేదాభిప్రాయాలు పెరిగినవి; ఒకరినొకరు అపార్థం చేసుకోసాగారు. వారు ఒకరితో నొకరు మాట్లాడుకోవటం చాలా అరుదైంది. ఆమె నిర్దయుంగా భర్తబాధ పడేట్టుగా సందర్భం లేకున్నా అతన్ని దెప్పి పొడుస్తూండేది.

అతను నడుం వంచినప్పటికీ పూర్వపు ఆనందం ఉత్సాహం అతనిలో తగ్గలేదు. ఎంతో ఓర్పుతో, తృప్తితో ఆ ఇంటిలోనే శాంతంగా ఉండేవాడు. ఆమె అనవసరంగా విసుగ్గా కోపంగా ఉంటూందనే సంగతి గెస్టవ్ గ్రహించకపోలేదు. ఐతే ఆమెను బాధించే ఆ రహస్యం వేదన ఏమై వుంటుందో తెలుసుకోవాలని విశ్వప్రయత్నం చేశాడు కాని లాభం లేకపోయింది.

చివరకు బైటపడి అనేకసార్లు ఇలా అన్నాడు. "చూడు! నా మీద నీకీద్వేష భావం ఎందుకు! నా గూర్చిన భావాలేవో నిన్ను బాధిస్తూన్నవి. ఆ రహస్యాన్ని బైటపెట్టు."

ఆమె జవాబుగా ఇలా అనేది; "ఏమీ లేదు.... నిజం.... ఒక వేళ నాకేదైనా అసంతృప్తి ఉన్నట్లయితే, అందుకు కారణాన్ని మీరే వూహించికవి పెట్టాలి తమంతట తాముగా గ్రహించలేక అప్రయోజకత్వాన్ని వెలిబుచ్చుతూ, ఇతరుల సహాయం లేకుండా



తెలుసుకోలేని పురుషులంటే నాకు మహా మంట!"

"ఐతే ఏం చెప్పేందుకూ నీకు ఇష్టంలేదని అర్థమౌతోంది." యీమాటల్తో సంభాషణ పూర్తయేది. ఆ రహస్యమేదో ఛేదించకుండానే, అతను వెళ్ళిపొయ్యేవాడు.


మరీ రాత్రులు మరింత బాధాకరంగా తయారైనవి. వారిద్దరూ ఏకశయ్యనే శయనించేవారు. విశ్రాంతి తీసుకోవాల్సిన సమయంలో తన పక్కనే పడుకొని ఆమె అనవసరంగా, అసందర్భంగా అతనిమీద మండిపడుతూ బాధకలిగేట్టు సూటీపోటీమాటలు మాట్లాడేది. "గదంతా సరిపడేటంతగా శరీరాన్ని పెంచుతున్నావ్" అనేది.

ప్రతి చిన్న విషయానికి ఆమె అతని మనశ్శాంతిని భంగపరిచేది. ఏకాస్త చప్పుడైనా భర్తకిందికి వెళ్ళి చూడవలసిందే! తాను మరిచిపోయి వొచ్చిన నవలను భర్త కిందికివెళ్ళి తెచ్చిపెట్టవలసిందే! లేదా నారింజరసమున్న సీసాను వెతికి తేవాల్సిందే! కాని ఆమెచెప్పే వస్తుసామాగ్రంతా వెతికి తీసుకురావటం గెస్టావ్‌కు ఒకొకప్పుడు అసంభవమయేది. ఎందుకంటే ఆమె చెప్పిన స్థలంలో నారింజరసమున్న సీసా ఉండదు. ఆ సంగతి ఆమెకు నమ్మకంగా తెలుసు--కారణం--ఆమె వేరొక స్థలంలో ఆ వస్తువును దాచేసింది!

పట్టిచేతుల్తో భర్త తిరిగి రాగానే "ఆబుడ్డి దొరకలేదు! బుడ్డి ఎక్కడుందో నీకు తెలుసు. పట్టి చిలిపిచేష్టలు తప్పితే" అనేది, అతనికి అర్థంగాక గదంతా కలయజూచేవాడు. ఒక గంటదాకా యీవిధంగా తిరుగులాడాక "సరే కానీండి--వచ్చి పడుకోండి. మీ శరీరం తగ్గేందుకు రోజూ కొంత దూరం నడిస్తే సరిపోతుంది. స్పాంజల్లే రోజురోజుకూ వూరిపోతున్నారు" అనేది.

క్షణక్షణానికి అతని నిద్రకు భంగంకలిగించి, తను కడుపులో నొప్పితో బాధపడుతున్నాననేది. యుడికిలాంలో తడిపిన గుడ్డతో పొట్టమీద రుద్దమనేది. ఆమె అనారోగ్యంగా వున్నందుకు భర్త బాధపడే వాడు, శక్తివంచన లేకుండా ఆమె రుగ్మతను కుదిర్చేందుకు ప్రయత్నించేవాడు. ఇంటిదాకీ సెరిష్టీని లేపనా అని అడిగేవాడు. అప్పుడామె ఎంతో కోపంతోనూ విసుగుతోనూ "నువ్వొక మూర్ఖుడివి--సరే ఆ నెప్పి చాలా వరకు తగ్గింది, ఇప్పుడు కాస్త తేలిగ్గావుంది. ఇక హాయిగా నిద్రపో" అనేది.

"నిజంగా బాధ తగ్గిందా?" అనేవాడు.




ఇందుకు జవాబుగా ఆమె ఇలా అనేది,

"ఇక మాటలు కట్టిపెట్టు, తగ్గింది బాబూ తగ్గింది. నన్నిక విసిగించక నిద్రపోనీ. నీ శుష్కవచనాలతో నన్ను బాధించకు, చివరకు ఎందుకూ పనికిరాకుండా పోతున్నావు"

అతనెంతో నొచ్చుకునేవాడు. భార్యను కష్టపెట్టి నందుకు కుంగిపోతూ "కాని--" అని నీళ్ళు నమిలేవాడు.

"కానీలేదు అర్థణా లేదు. నాకు కొంచెం విశ్రాంతివ్వు. తెలిసిందా. ఇక పడుండండి," అని, గోడవైపు వొత్తిగిలి పడుకునేది.

ఇక చేసేదిలేక గెస్టావ్ చాలా సేపటి వరకూ బాధపడి, అలసిపోయి నిద్రిస్తూండేవాడు.

* * *

ఒకనాటి రాత్రి హఠాత్తుగా ఆమె అతన్ని తట్టి లేపింది. ఒక్కసారిగా నిద్రాభంగం కావటంతో అతను భయంతో వణికిపోతూ కూర్చున్నాడు. ఇంత త్వరగా క్షణాల్లో సంఘటన మారటంవల్ల, అతను తట్టుకోలేక పొయ్యాడు.

"ఏమిటి?--ఏమైంది?" అన్నాడు నీళ్ళునములుతూ.

ఆమె అతని చేతిని పట్టుకొని బలంకొద్దీ గిల్లింది. అతను బాధతో మూలిగాడు ఆ తరువాత చెవిమీద గుద్దింది. యీ విధంగా భర్త నిద్రమత్తు వదిలించాలని ఆమె అభిప్రాయం.

"ఇంట్లో ఏదో చప్పుడు విన్నాను" అందామె.

యీ రకం భయాలకు ఆమె ప్రతి రాత్రి గురవుతూండటంవల్ల, అతను గాబరాపడలేదు. శాంతంగా అన్నాడు.

"ఏం చప్పుడు?"

ఆమె భయంతో వణికిపోతూన్నట్లుగా "చప్పుడు....శబ్దం.....పాదాల చప్పుడు.....ఇంట్లో ఎవరో ప్రవేశించిన చప్పుడు..... తెలిసిందా?" అంది.

అతనిలో చలనం కలగలేదు. మామూలు ధోరణిలో "ఎవరో వచ్చారంటావా? ఊహూం నువ్వు పొరబడివుంటావు. ఐనా ఇప్పుడు ఎవరు, ఎట్లా యీ మేడలోకి ప్రవేశించి వుంటారంటావు?' ' అన్నాడు.

ఆమె ఎగిరిపడి అంది; "ఎవరా? కాస్త బుర్ర ఉపయోగించు--దొంగలు--ఇంకెవరు? దొంగలే!"

మెల్లిగా దుప్పటి మీదికి లాక్కుంటూ అతను అన్నాడు: "ఎవ్వరూ లేరు. బహుశా కలగని వుంటావు. పడుకో"

ఆమె కోపంతో మండి పడుతూ దుప్పటిలాగి అవతలపారేసి, పక్కమీదినుంచి కిందికి దూకి అంది: "ఎంత అసమర్థుడివో అంత పిరికిపందవుగా తయారయావు! నీ పిరికి తనంతో నేను ప్రాణాల్ని పోగొట్టుకోవాల్సి వచ్చేట్టుంది."

ఆమె లేచి వెళ్ళి అగ్ని గుండలోంచి ఎర్రగా కాలిన పెద్ద పటకారు తీసి, పోట్లాటకు సిద్ధమైనట్టుగా తలుపు దగ్గరకు వెళ్ళింది.

భార్య పరిస్థితికి గెస్టవ్ చలించాడు; అంతకన్న ఆమె ధైర్యానికి సిగ్గుపడ్డాడని చెప్పవచ్చు. వెంటనే భార్యచేతిలోని పెద్ద పట్కారును లాక్కొని, ఆమెను ముఖాముఖిగా నుంచున్నాడు.

చీమ కదుల్తే వినపడేటంత నిశ్శబ్దంలో వారు ఇరవైనిమిషాలవరకూ నిలబడ్డారు. ఏ విధమైన అలికిడీ లేదు. తన మాటలు అబద్ధమైనట్లుగా బాధపడి, కోపంతో ఆమె "ఏమైన ఎవరో ఇంట్లో వున్నట్లు నేను

నమ్మకంగా చెప్పగలను" అని పక్కమీదకు వెళ్ళింది.

యీ సంఘటన ఒక రభస కాకుండా వుండేందుకని గెస్టప్ ఆ(ప్రస్తావనే)తేలేదు. ఆమె ప్రధానా భయపడినప్పటికీ, ఆమె భయాన్ని పెంచటమవుతుందనే ఉద్దేశ్యంతో అతను మెదలకుండా వూరుకున్నాడు. కాని మర్నాటి రాత్రి, గతరాత్రికన్న ఎక్కువ గాబరాతో ఆమె తన భర్తను హఠాత్తుగా నిద్రనుంచి మేల్కొల్పింది. "చూడండి.... ఇప్పుడే ఎవరో తోటలోని గేటు తెరిచారు" అందామె.

అతను ఆశ్చర్యపడ్డాడు. తనభార్య ఏదో వూహించి భయపడుతోందనే ఉద్దేశ్యంతో, ఆమెకు నచ్చచెప్పుదామనే ప్రయత్నంలో వుండగా ఇంటి కిందిభాగంలో నిజంగానే శబ్దం వినిపించింది. వెంటనే అతను లేచి కిటికీ దగ్గరకు పరుగెత్తాడు.... నిజమే.... ఎవరో వ్యక్తి త్వరత్వరగాతోటలో నుంచి వెళ్తున్నాడు.

మూర్ఛ పడుతూన్నట్టుగా తూలుతూ అతనుగొణిగాడు. "ఔను..... ఎవరో ఉన్నారు"

ఆ తరువాత అతను తనకు తాను ధైర్యం చెప్పుకున్నాడు. ఒక నిశ్చయానికి రాసాగాడు. తన యాజమాన్యంలో వున్న ఎస్టేట్‌లోకి దొంగతనంగా ఎవరో ప్రవేశించి, తనను అవమానించారనే కోపానికీ, రోషానికీ గురయ్యాడు.

"ఉండు..... ఏం చేస్తానో చూడు" అన్నాడు.

వెంటనే డ్రాయర్ దగ్గరకు పరుగెత్తి రివాల్వర్ తీసుకొని చప్పుచప్పున కిందకి దిగి వెళ్ళాడు. ఆమె తత్తరపాటుతో అతనివెనుక పడి; "మీరు వెళ్ళకండి.... నన్ను వొంటరిగా వదిలి వెళ్ళకండి.... ఏమండీ!" అందికాని, అతను వినిపించుకోకుండా వెళ్ళిపొయ్యాడు. ఇక చేసేదిలేక ఆమెపడక గది తలుపులు బిగించుకొని ఆతృతతో కూర్చుంది.

డ్రాయర్ దగ్గరకు పరుగెత్తి రివాల్వర్ తీసుకొని చప్పుచప్పున కిందకి దిగి వెళ్ళాడు. ఆమె తత్తరపాటులో అతని వెనుకపడి; "మీరు వెళ్ళకండి.... నన్ను వొంటరిగా వదిలి వెళ్ళకండి.... ఏమండీ!" అంది కాని, అతను వినిపించుకోకుండా వెళ్ళిపొయ్యాడు. ఇక చేసేది లేక ఆమె పడకగది తలుపులు బిగించుకొని ఆతృతతో కూర్చుంది.

* * *

ఐదు నిమిషాలు.... పదినిమిషాలు.... పావుగంట గడిచింది. ఆమె ఆతృతతో ఇంతసేపూ వేచికూర్చుంది. ఏదో పిచ్చి భయం ఆమెను ఆవరించింది. అనుమానం లేకుండా--వాళ్లు. ఆ దొంగలు తనభర్తను చంపివుంటారు. తన భర్తను పట్టుకొని, గొంతు నులిపివేసి వుంటారు. తన భర్త నిస్సహాయుడుకాదు; తనను తాను కాపాడుకోగలడు; కాని అతను తీసుకొని వెళ్ళిన ఆరుగుళ్ళ రివాల్వర్ తాలూకు మోతన్నా వినిపించందే ఆమె తన భర్త క్షేమాన్ని ఎలా నమ్మగలుగుతుంది! చుట్టుపక్క లంతా వేళ్ళాడే నిశ్శబ్దం ఆమెకు భయంక రంగా తోచింది.

ఒంటరిగా కూర్చోలేక, ఆమె ఇంటి దాసీ సెలెస్టీకోసం గంట వాయించింది. కాని జవాబురాలేదు. ఆమె తిరిగి తిరిగి గంట వాయించింది. కాని ప్రయోజనం లేకపోయింది. విపరీతమైన ఉద్రేకాలకు గురికావటంవల్ల ఆమెకు దాదాపు మూర్ఛ పర్యంతమైంది. లంకంత కొంపలోనూ ఎలాటి శబ్దమూ వినిపించటంలేదు. ఫాల భాగం వేడెక్కింది. గాజు తలుపుమీద ముఖం ఆనించి, ఆ చీకట్లోకి చూడసాగింది. తోటలో నిశ్చలంగా వున్న చెట్లనీడలు తప్ప ఆమెకు మరేమీ కనిపించలేదు.

అర్ధరాత్రి దాటి అరగంటయింది. తన భర్త బైటికివెళ్ళి ముప్పావుగంట! అతన్ని తిరిగిచూసే అదృష్టం తనకికలేదు. తను వేధపరికాన్ని అనుభవించాల్సిందే! ఏదో దుఃఖం ఆమెలో పొంగిపొరలింది. మోకా ళ్లమీద వొంగి, ఆమె ఏడ్వసాగింది.

గది తలుపుమీద రెండు చిన్న దెబ్బలు పడినవి.

"తలుపుతియ్....నేనే."


ఆ గొంతు తన భర్తది. ఆమె వెంటనే పరుగెత్తుకెళ్ళి తలుపు తెరిచింది. తన భర్త ఎదురవగానే ఎంతో ఆపేక్షతో అతన్ని కౌగిలించుకొని "నన్ను వదిలి ఎక్కడికి వెళ్ళారు? నేను ఒంటరిగా భయంతో చచ్చిపోతున్నాను నన్ను గూర్చిన చింతే నీకులేదు. నేనసలు బతికివున్నాననికూడా నువ్వు ఆలోచించవు" అంది కన్నీళ్లతో.

అతను గది తలుపు వేసేశాడు. ఆ తరువాత పిచ్చివానివలే ఒకటే నవ్వటం. డొక్కలు చెక్కలయ్యట్టు నవ్వటంతో కళ్ళ వెంట నీరు వచ్చింది. ఆమెకు ఇదేమీ అర్థంగాక ఆశ్చర్యంతో నిలబడిపోయింది.

ఎలాగో నవ్వు ఆపుకుంటూ తెరలు తెర లుగా అన్నాడు. "అది...దాసి...సెలెస్టీ...ఆమె ఆపూల మొక్కలుంచే చిన్న ఇంటిలో..... నేనక్కడ ఏం చూశానో... నువ్వు తెలుసుకుంటే...."

ఆమె పాలిపోయింది. ఓర్పును కోల్పోవటంతో ఆమెకు గొంతు ఎండినట్లయింది.

"ఏమిటీ! ఆ దాసిముండ సెలెస్టీయా! నా ఇంట్లో.... నా తోటలో.... వాణ్ణి, దాని ప్రియుణ్ణి నువ్వు చంపలేదా? నీ దగ్గర రివాల్వరున్నా నువ్వు చేతులూపుకుంటూ వచ్చావా? నా ఇంట్లో యీ అపవిత్రం జరుగుతూంటే చూస్తూ వూరుకున్నావా?" అందామె ఎంతో ఉద్రేకంతో, ఇంకేమీ చేసేందుకు ఓపిక లేక ఆమె అక్కడే కూలబడింది.



అతను ఏదో ఆనందంతో ఊగిపోయాడు. ఒకింత భరతనాట్యం చేశాడు. అటూ ఇటూ తిరుగుతూ కడుపుబ్బేట్టు నవ్వాడు.

"నువ్వు తెలుసుకుంటే.....తెలుసుకుంటే అని హఠాత్తుగా ఆమెను కావిలించుకొని ముద్దు పెట్టుకున్నాడు.

ఆమె ఒక్కసారిగా విదిలించుకొని, కోపంతో ఒణికే గొంతుతో అంది; "దాన్ని.... ఆ దాసీదాన్ని ఒక్కరోజు కూడా ఈ ఇంట్లో ఉండనీను--విన్నవా? ఒక్కరోజుకాదు-- ఒక్క క్షణం కూడా అది ఈ ఇంట్లో ఉండేందుకు వీల్లేదు. దాన్ని తిరిగి ఇక్కడికి రానీ-- విసిరి అవతల పారేయిస్తాను"

సాహిత్యం ఎక్కడో లేదు, నీ చుట్టే ఉంది. కథలు ఎక్కడో లేవు నీ చుట్టూ ఉన్న వ్యక్తుల్లోనే ఉన్నాయని, నీ చుట్టూ ఉన్న మనుషుల మాట, పలుకు, దుఃఖం నిండా కథలు పరచుకొని ఉన్నాయని నిరూపించి, అనితరసాధ్యమైన శైలిలో తెలుగుకథను గొప్ప మలుపు తిప్పిన మహాకథకుడు "రావిశాస్త్రి" మృతికి 'కథావేదిక' సంతాపాన్ని తెలియజేస్తోంది.

అత్యధిక శాతం పేదలున్న ఈ దేశంలో పేదల కన్నీళ్ళు, ఆకలి మంటలు.... ఈ నేపథ్యంలో వారి ఘర్షణ, ఆరాటం, పోరాటం విభిన్న దృక్కోణాల నుంచి చిత్రించిన రావి శాస్త్రీయమైన కథలు తెలుగు కథ ఉన్నంత కాలం ఉంటాయి. తెలుగు కథ కన్నబిడ్డ కన్ను మూసినందుకు విచారం వ్యక్తంచేస్తూ, ఉత్తమ తెలుగు కథా ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోవడం ద్వారా 'రావిశాస్త్రి' కి నివాళులు అర్పించాలని కథా రచయితలకు 'కథావేదిక' విజ్ఞప్తి చేస్తోంది.

గెస్టవ్ ఆమె నడుం మీద చేయివేసి కదలకుండా పట్టుకొని, ఎంతో ఉద్రేకంతో ఆమె ముఖంమీద, చెక్కిళ్ళపైన, మెడమీద, రొమ్ములమీద వేడి వేడి ముద్దుల వర్షం కురింపించాడు ఆమె ఆశ్చర్యంతో మూగపోయింది; గడచిన దాంపత్య జీవితంలోని మాధుర్యమేదో ఆమెకు జ్ఞాపకం వచ్చింది. అతను ఆమెను కావలించుకొని, సున్నితంగా పక్కవైపు లాక్కువెళ్లాడు.

ఉదయం తొమ్మిదిన్నరయింది. ఎంతో పెందలకడనే యజమానీ యజమానురాలూ మేల్కొని కిందికి రావటం అలవాటు; అలాటిది ఇంత ఆలస్యంగా కూడా వారు మేడదిగి రాకుండటం సెలస్టీకి ఆశ్చర్యంగావుంది. అందుకని ఆమె మెల్లిగా పైకి వెళ్ళి గది తలుపు తట్టింది.

ఆ దంపతులు శయ్యమీది నుంచి కాలు కింద పెట్టనేలేదు. సంతోషంగా ఏమేమో మాట్లాడుకుంటున్నారు. సెలెస్టీ మరింత ఆశ్చర్యపడి "అమ్మా! కాఫీ తెచ్చాను" అంది.

పాల్మయిరీ మృదువుగా అంది; "మేము కాస్త అలసివున్నాము.... ఇక్కడికి తీసుకురా, రాత్రి మాకు సరిగా నిద్రపట్టలేదు"

సెలెస్టీ వచ్చి గదిలో కాఫీ ఉంచి వెళ్ళిపోయింది. గెస్టవ్ తిరిగి నవ్వుతూ, తన భార్య మెడకింద చక్కలగిలిపెడుతూ "ఆ దృశ్యం నువ్వు చూసివుంటే.... నీ కడంతా తెలుస్తే...." అన్నాడు.

ఆమె అతని విలిపి చేతుల్ని తన చేతుల్లో బంధించి "చూడు. ఇక వూరుకో, ఇంత విపరీతంగా నవ్వుతే నీ ఆరోగ్యం చెడుతుంది." అని వారించి అతని కళ్ళమీద సున్నితంగా ముద్దుపెట్టుకుంది.

* * *

ఆ రోజు మొదలు పాల్మయిరీ అనవసరంగా కోపంతో. ఉద్రేకంతో, విసుగుతో బాధపడటంలేదు. ఒకో వెన్నెల రాత్రి ఆ దంపతులిద్దరూ మెల్లిగా ఆ తోటలో షికారుగా నడుస్తూ, మొక్కల్ని దాచేందుకు ఉపయోగించే చిన్న ఇంటివరకూ వెళ్తూంటారు. లోపల ఏదో అతి విచిత్ర సంఘటన జరుగుతూన్నట్లుగా వారు కదలక మెదలక చూస్తూంటారు. ఊపిరి గట్టిగా పీలుస్తే తమ ఆనందం ఎక్కడ చెడుతుందేమోననే భయం వారికి వున్న దనిపించేటంత తీక్షణంగా ఆ దృశ్యాన్ని వారు చూస్తూంటారు.

సెలెస్టీకి జీతం పెంచారు; కాని గెస్టవ్ సన్నబడసాగాడు. ★

